క్లుప్తంగా

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు–నేడులో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సమకూరిన 340 గ్లాసులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నాణ్యమైన మెనూ అమలు చేస్తోందన్నారు. ఇటీవల రాగి జావ పంపిణీ కూడా ప్రారంభమైందన్నారు. రాగిజావ పంపిణీకి అవసరమైన గ్లాసులను కూడా ప్రభుత్వమే సమకూర్చిందన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి: ఎంఈఓ



నందిగామ: విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఎంఈఓ బి.బాలాజీ స్పష్టంచేశారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఎంపీయూపీ పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన తయారీ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మెనూ విషయంలో తేడా వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

చిల్లకల్లు వద్ద వాహనాల తనిఖీలు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సీఐ నాగమురళి సూచించారు. చిల్లకల్లు పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా సంస్థల బస్సులకు సంబంధించి యాజమాన్యాలు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ కానుక పంపిణీ



వీరులపాడు: ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం చైతన్య వేదిక ఆధ్వర్యంలో మండలంలోని అల్లూరు, పెద్దాపురం గ్రామాల్లోని ముస్లింలకు రంజాన్ కానుకగా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. ముస్లిం కుటుంబాలకు కానుక అందజేసిన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కరిముల్లాను అభినందించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచ్ బందెల రాణి, నాయకులు యాకుబ్ వలీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆనవాళ్లుగా పేదల ఇళ్లు

గడప గడపకు మన ప్రభుత్వంలో నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): తరతరాలుగా సొంత ఇంటికి నోచుకోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు నేడు అభివృద్ధికి ఆనవాళ్లుగా నిలిచాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు ఎమ్మెల్యే వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. లక్షలాది మంది నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. యువత, మహిళలు, రైతులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో మునుపెన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమ మార్పులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్నికల సమయంలో, ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేసి, ప్రజలు సంతృప్తి చెందితేనే ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంచి చేయాలనే తలంపుతోనే పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి చర్యలు

అల్లూరు గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మొండ్రు బాయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ కోటేరు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం



భూ రీసర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మకుమారి

పెనుగంచిప్రోలు(వత్సవాయి): మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో జగనన్న భూ రక్ష, భూ రీసర్వేను సర్పంచ్ వేల్పుల పద్మకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న సర్వే పనులు పూర్తవుతాయన్నారు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో భూవివాదాలు లేకుండా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగానే రీసర్వే జరుగుతోందని వివరించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, వీఆర్వో బేబీ పాల్గొన్నారు.

పొలాల్లో హద్దురాళ్ల ఏర్పాటు

కంచికచర్ల: జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టి అనతికాలంలో కచ్చితమైన కొలతలు, హద్దులతో హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాలలో ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేసి ఆ భూముల్లో గురువారం హద్దు రాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి నెల నుంచి గ్రామంలోని పొలాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సర్వే హద్దురాళ్లను సిబ్బందితో పాతిస్తున్నామన్నారు. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని సూచించారు. ఏప్రిల్ నెలాఖరులోగా హద్దురాళ్ల ఏర్పాటు పూర్తిచేస్తామన్నారు. రైతులు కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని పేరకలపాడు, గండేపల్లి, కీసర, పెండ్యాల గ్రామాల్లో భూముల రీ సర్వే చేపట్టామని తహసీల్దార్ తెలిపారు. డీటీ నాగుల్‌మీరా, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, సర్వేయర్ బసవరావు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



సంక్షేమ పథకాలపై వృద్ధురాలితో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను

చిట్టేల(వత్సవాయి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. వత్సవాయి మండలం చిట్టేలలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. పథకాల అమలు గతంలో బాగుందా ప్రస్తుతం బాగుందా అని అడగ్గా.. నేరుగా తమ బ్యాంక్ ఖాతా ల్లో నగదు జమచేయడం బాగుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఇంత వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేని చంద్రబాబు మీడియాను అడ్డు పెట్టుకుని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మార్నెళ్ల అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు మార్నెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్, సర్పంచ్ జాల పెద్ద కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కె.చిన్నమ్మ, వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల అధ్య క్షులు వూట్ల నాగేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, పూసల సంఘ డైరెక్టర్ చేని కుమారి, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి సునీత, శ్రీనివాసరావు తదితరులు

కంచికచర్ల: 'జగనన్నతోనే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు అన్నారు. కంచికచర్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం జరిగింది. కంచికచర్ల వసంతకాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, అరుంధతీనగర్ తదితర కాలనీల్లో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనంద జ్యోత్స్న, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, మొగులూరులో సొసైటీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జున రావు, ఎస్.అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాడుగుల మధుబాబు, పాపట్ల సీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో శుక్రవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ విజయవాడ రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలు, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు సెక్షన్ల పరిధిలోని గ్రామాల్లో 132 కేవీ లైన్లకు మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉదయం ఆరు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే వార్డు పర్యటన



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మునిసిపల్ కమిషనర్

నందిగామ: ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే రోజూ వార్డు పర్యటన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలో ఉన్న అనాసాగరం డీవీఆర్ కాలనీలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ పనులను కమిషనర్ పరిశీలించడంతోపాటు స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో ప్రజల నుంచి సమస్యలు సేకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏఈ ఫణి శ్రీనివాసరావు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



సంక్షేమ పథకాల అమలుతీరును ప్రజలకు వివరిస్తున్న గాంధీ, నాగమణి

పెనుగంచిప్రోలు(వత్సవాయి): రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తున్నారని పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి తెలిపారు. పెనుగంచిప్రోలు మండలంలోని సుబాయిగూడెం, కొళ్లికూళ్ల గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి వివరించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్న ప్రభుత్వం తమదేనని వివరించారు. సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ కన్నమూల శామ్యూల్, సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కోనంగి ముక్కంటి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సువర్ణ పాలన సాకారం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

గనిఆత్కూరు(కంచికచర్ల): అర్హత గల ప్రతి ఇంటికీ జగనన్న సంక్షేమ పథాకాలు అందాయని, అందుతున్నాయని దీంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. రాష్ట్రంలో సువర్ణ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు నిర్ణయించారని పేర్కొన్నారు. కంచికచర్ల మండలంలోని గనిఆత్కూరు గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల హరిజగన్నాథరావు అధ్యక్షతన గృహసారథులు, వలంటీర్లు, నాయకులతో గురువారం సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, సువర్ణపాలన సాగిస్తున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు అందించే సంక్షేమ పథకాలన్నీ రద్దుచేస్తామని ఇప్పటికే ఆ పార్టీ నాయకులు అంటున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజల నెత్తిపై భారం మోపారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎటువంటి పన్నులు పెంచకుండా పాలన అందిస్తున్నారని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను స్వచ్ఛందంగా గోడలు, తలుపులకు అంటించుకుంటున్నారని గృహసారథులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ఖాజాబాషా, గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న కంచికచర్ల ఫైర్ సిబ్బంది



జగ్గయ్యపేటలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కంచికచర్ల: అగ్ని ప్రదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని లీడింగ్ ఫైర్ అధికారి కృష్ణమూర్తి సూచించారు. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించటంతోపాటు కరపత్రాలను పంపిణీచేశారు. లీడింగ్ ఫైర్ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో తడిలేకుండా చూడాలని సూచించారు. వంట గదిలో గ్యాస్ లీకయితే ముందుగా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ఒక్కో సారి బస్సులో ఇంజిన్ వేడెక్కటం వల్ల టైర్ల రాపిడి వల్ల కూడా మంటలు వస్తాయని వివరించారు. బయట వ్యక్తులు తమ ప్రాంతాల్లో సంచరిస్తే స్థానికులు తక్షణం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జగ్గయ్యపేట అర్బన్: వేసవి నేపథ్యంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ టి.మురళీకృష్ణ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫైర్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, ప్రమాదాలపై వివిధ పాఠశాలల విద్యార్థులకు గురువారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటుచేసిన అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు. ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించి నివారించగలిగితే నష్టం ఉండదన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు స్వచ్ఛందంగా తమకు సమాచారం అందించాలని కోరారు. తాము తక్షణం స్పందించి ప్రమాదాల తీవ్రతను తగ్గిస్తామన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



అంబేడ్కర్, జగజ్జీవన్‌రావ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఉదయభాను, కృష్ణమాదిగ

చిట్టేల(వత్సవాయి): రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ బడుగుజీవుల ఆశాజ్యోతులు అని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. చిట్టేల గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సంద్భంగా సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను, మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. సమసమాజ స్థాపనకు వారు చేసిన కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. కొందరు వారిని కేవలం కులాలకు పరిమితం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. భావితరాలకు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గురించి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలుత గ్రామశివారు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా ర్యాలీ నిర్వహించారు. మార్నెళ్ల అమ్మిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ట్రస్టు అధ్యక్షులు మార్నెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు వేల్పుల రవికుమార్, సర్పంచ్ జాల పెద్దకోటేశ్వరరావు, జెడ్పీటీసీ ఎంపీటీసీ సభ్యులు యేశపోగు దేవమణి, కొదమల తేజశ్రీ, గాదెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., జగ్గయ్యపేట బ్రాంచ్ వారి సంజాయిషీ తెలియజేయునది ఏమనగా కాకాని హరిబాబు S/o. కృష్ణమూర్తి, ఎన్.టి.ఆర్. జిల్లా, పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన వారి యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము మంజూరు చేయుచున్నారు. కావున ఈ ఆస్తిపై ఎవరికైననూ ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజులలోగా తగు సాక్ష్యాధారాలతో తెలియ పరచవలెను. ఎట్టి అభ్యంతరములు రాని యెడల ఈ ఆస్తి నిర్వివాదమైనదిగా భావించి ఋణము మంజూరు చేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బంధ చేయజాలవు.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచిప్రోలు గ్రామం దాఖలుమెంటు నెం. 1 : 3907/2018, R.S.No. 176/1, 176/2 లోని య. 2.30 సెంట్ల భూమికి హద్దులు. తూర్పు: [illegible] దక్షిణం: మున్నేరు, పడమర: [illegible] ఉత్తరం: [illegible]

దాఖలుమెంటు నెం. 2 : 3909/2018, R.S.No. 176/1, 176/2 లోని య. 2.30 సెంట్ల భూమికి హద్దులు. [illegible]

దాఖలుమెంటు నెం. 3 : 4482/2017, R.S.No. 175/8 లోని య. 1.18 సెంట్ల భూమికి హద్దులు. [illegible]

ఈ మూడు దాఖలుమెంట్ల మొత్తం విస్తీ య. 5.78 సెంట్లు [illegible]

జగ్గయ్యపేట, తేది: 20-04-2023 — రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12620, Enrolment No.: 1370/1987


ఆశీల వేలంలో రూ.5.46 లక్షల ఆదాయం

నందిగామ: పట్టణంలోని పలు మార్కెట్ల పరిధిలో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు మునిసిపల్ కార్యాలయంలో గురువారం బహిరంగ వేలం జరిగింది. మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పర్యవేక్షణలో మే ఒకటి నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఆశీలు వసూలు చేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. సంత్రి మార్కెట్‌లో ఆశీలు వేలంలో రూ.3.96 లక్షలు, కూరగాయల మార్కెట్‌కు రూ.1.50 లక్షల చొప్పున రూ.5.46 లక్షల ఆదాయం వచ్చింది. పట్టణానికి చెందిన కరిముల్లా హెచ్చు పాటతో రెండు వేలాలను దక్కించుకున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

మైలవరం: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సీ) అనుసరించి 2022–23 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిందని ఎంఈఓ పి.రత్నశ్యామ్‌బాబు గురువారం తెలిపారు. తొలి విడత విద్యార్థుల దరఖాస్తు ప్రక్రియ మార్చి 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు జరిగిందన్నారు. సదరు దరఖాస్తులకు అర్హత పొంది, మొదటి లాటరీ ద్వారా ఎంపికైన 397 మంది విద్యార్థుల జాబితా వివరాలు, వారికి కేటాయించిన పాఠశాలల వివరాలను మండలాల వారిగా మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల ఉప తనిఖీ అధికారికి పంపించినట్లు తెలిపారు.

23న జగ్గయ్యపేటలో వైద్య శిబిరం



ప్రభుత్వ విప్ ఉదయభానుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గాయత్రీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఈ నెల 23వ తేదీన శ్రీగాయత్రీదేవి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గాయత్రీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కలవకొలను వీరాంజనేయశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. సంఘ అధ్యక్షుడు వీరాంజనేయ శర్మ వైద్య శిబిరం వివరాలను తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు స్థానిక గాయత్రీ కల్యాణమండపంలో వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెలా చివరి ఆదివారం గాయత్రీ కల్యాణ మండపంలోనే జరిగే వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం పరీక్షలను అతి తక్కువ ఖర్చుతో నిర్వహిస్తామన్నారు. డాక్టర్ల కన్సల్టేషన్ ఫీజుగా సంవత్సరానికి రూ.20, నెలకు సరిపడా మందులను రూ.100 స్వీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్ జొన్నాబట్ల, సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.